క్లుప్తంగా

శివ్వారం వైపు రాకపోకలకు అనుమతి ఇవ్వాలి

జైపూర్: వేలాలలో ఈ నెల 26న మహాశివరాత్రి జాతర సందర్భంగా వాహనాల పార్కింగ్‌కు సంబంధం లేకుండా శివ్వారం, పొనూర్, గోపాలపూర్ గ్రామాలకు రాకపోకలకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఆర్నే సమ్మయ్య, జాడి ఏసయ్య గురువారం అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు నిత్యం వేలాల మీదుగా మంచిర్యాల, గోదావరిఖని, మంథని, కరీంనగర్‌కు రాకపోకలు సాగిస్తుంటారని, జాతర నిర్వహణలో వాహనాల పార్కింగ్ పేరిట సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తే విధంగా డబ్బులు వసూలు చేయడం సరికాదని, జాతర భక్తులకు మాత్రమే పార్కింగ్ డబ్బులు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన



స్వాగతం పలుకుతున్న ఆసుపత్రి సిబ్బంది

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని విశాఖపట్నంకు చెందిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్సీ) ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ గురువారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలు, టీకాల నిర్వహణ, వ్యర్థ పదార్థాల తరలింపు, తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. బెల్లంపల్లి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధాకర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్, ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమారి, డీపీఓ ప్రశాంతి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు పెంచాలి


బెల్లంపల్లి: రైల్వే సీఐడబ్ల్యూ సెక్షన్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ రైల్వే క్యాజువల్ కాంట్రాక్ట్ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి రైల్వే ఎస్ఎస్ఈసీఅండ్ డబ్ల్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామాచారి, జిల్లా గౌరవ అధ్యక్షుడు రంజిత్ కుమార్, బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, నాయకులు పాల్గొన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు

పులి దాడిలో గేదె మృతి

భీమారం: మండలంలోని దాంపూర్ అడవిలో పులి దాడిలో గేదె మృతిచెందింది. దాంపూర్ గ్రామానికి చెందిన మేకల బాపు మామిడి తోటలో కట్టేసి ఉన్న గేదెపై బుధవారం రాత్రి దాడి చేసి హతమార్చింది. గురువారం సంఘటన స్థలాన్ని అటవీశాఖ మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు, భీమారం డీఆర్వో సుధాకర్ పరిశీలించారు. పెద్దపులి పాదముద్రలు గుర్తించారు. ప్రజలు అడవిలోకి వెళ్లొద్దని దాంపూర్ సెక్షన్ ఆఫీసర్ రాజేశ్వరి కోరారు. గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో రెడ్డిపల్లితోపాటు పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.



పెద్దపులి పాదముద్రలు

చెన్నూర్ గోదావరినది ప్రాంతంలో లోపించిన పారిశుధ్యం



తీరం.. చెత్తమయం!

- మహాశివరాత్రికి గోదావరిలో పుణ్యస్నానాలు
- 20వేల మంది తరలివచ్చే అవకాశం
- చెత్తాచెదారంతో అధ్వానంగా నదీ పరిసరాలు
- పారిశుధ్య పనులు చేపట్టాలని భక్తుల విన్నపం

చెన్నూర్: చెన్నూర్ గోదావరి నది ఉత్తర దిశగా ప్రవహిస్తుంది. దీంతో చెన్నూర్ గోదావరి నదికి ఉత్తరవాహిని గోదావరి నది అని పేరుంది. చెన్నూర్ గోదావరి నదికి కాశీ నది అంత ప్రాశస్త్యం ఉంది. ఇక్కడ స్నానమాచరిస్తే కాశీలోని గోదావరినదిలో స్నానం ఆచరించిన పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. ప్రస్తుతం పవిత్ర గోదావరి తీరం అపరిశుభ్రంగా మారింది. గోదావరి నదికి వెళ్లే రహదారి సైతం అధ్వానంగా మారడంతో నదికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 26న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు సుమారు 20వేల మందికి పైగా భక్తులు రానున్నారు. గతేడాది అధికారిక లెక్కల ప్రకారం 18వేల మంది పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.



అధ్వానంగా మారిన గోదావరి రోడ్డు

ఇసుక వాహనాలతో..

గోదావరి నది నుంచి సింగరేణి సంస్థకు ఇసుక తరలిస్తున్నారు. రోజుకు సుమారు 50నుంచి 60లారీలు ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గోదావరి రోడ్డు గుంతల మయంగా తయారైంది. గోదావరి నదికి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీల రాకపోకల కారణంగా దుమ్ములేవకుండా రోడ్డుపై నీరు చల్లడంతో రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ద్విచక్రవాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా గుంతల్లో నీరు నిలిచి లారీలు వేళ్లే సమయంలో పక్క నుంచి వెళ్లే వాహనదారులు, పాదాచారులపై బురద పడుతుండడంతో అవస్థలు పడుతున్నారు. సింగరేణి అధికారులు శివరాత్రి వేడుకల సందర్భంగా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశానవాటిక లేక..

చెన్నూర్‌లో ప్రత్యేక శ్మశానవాటిక లేకపోవడంతో అంత్యక్రియలను గోదావరి తీరంలోనే నిర్వహిస్తారు. దీంతో ఆ ప్రాంతం పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారింది. అంత్యక్రియలకు ఉపయోగించే కర్రలు, దుస్తువులు, ఇతర వస్తువులు అక్కడే వదిలిరావడంతో పారిశుధ్యం లోపించింది. మహా శివరాత్రి వేడుకల సందర్భంగా పవిత్ర స్నానం ఆచరించే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి గోదావరి తీర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తా, చెదారం తొలగించి భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది



గోదావరి నదికి వెళ్లాలంటే నరకం కన్పిస్తుంది. రోడ్డు శిథిలావస్థకు చేరి గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే భయం వేస్తుంది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో దుమ్ము లేవకుండా నీరు పోస్తుండడంతో వాహనదారులు జారి పడుతున్నారు. గుంతల్లో నీరు నిలిచి, ఒక్కోసారి గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నాం. శివరాత్రిని పురస్కరించుకొని రోడ్డును బాగు చేయాలి.

– సామల మోహన్, చెన్నూర్

చెత్తాచెదారం



గోదావరి తీరం వెంట చెత్తా,చెదారం పేరుకుపోయింది. వారం రోజుల్లో శివరాత్రి పండగ ఉంది. ఇప్పటికే మల్లన్న బోనాలు పోసే భక్తులు గోదావరి నది స్నానాలు ఆచరిస్తున్నారు. పవిత్ర గోదావరి తీర ప్రాంతంలో పారిశుద్యం లోపించి ఉండడంతో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్య పనులు చేపట్టాలి.

– కూచడి రవీందర్‌రావు, చెన్నూర్

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు మధ్యలో కరెంట్ స్తంభం



నెన్నెల: మండల కేంద్రంలోని శివాలయం పక్కన సీసీ రోడ్డు మధ్యలో కరెంట్ స్తంభం ఉండటంతో వాహనదారులు ప్రతీ రోజు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ పోల్ తొలగించి రోడ్డు పక్కకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : రాజన్న, విద్యుత్ ఏఈ ఫోన్ నంబర్ : 80746 52880

చెత్త వాహనాలు అడ్డగింత

కాసిపేట: మండలంలోని దుబ్బగూడెం, పెద్దనపల్లి శివారు ఓపెన్‌కాస్ట్ గేటు సమీపంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్లను గురువారం దుబ్బగూడెం గ్రామస్తులు అడ్డుకొని ఆందోళనకు దిగారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్తను పెద్దనపల్లి వెళ్లే మార్గంలో డంపింగ్ చేయడం గత నెల రోజులుగా వివాదంగా మారింది. ఎన్నిమార్లు అడ్డుకున్నా చెత్తపోయడం ఆపడం లేదని, అనుమతులు ఎవరిచ్చారో చూపాలని కోరినా, చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీగా చెత్తను తీసుకొచ్చి డంప్ చేస్తూ, స్థానికుల సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. అనుమతులు చూపిస్తే అనుమతులిచ్చిన అధికారుల వద్ద తేల్చుకుంటామని, ట్రాక్టర్లను అడ్డుకోమన్నారు. అప్పటి వరకు చెత్త తీసుకురావొద్దని హెచ్చరించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి నచ్చజెప్పారు. చెత్త ట్రాక్టర్లను తిప్పి పంపించారు. ఏది ఏమైనా అనధికారికంగా మున్సిపాలిటీ చెత్త 15కిలోమీటర్ల దూరంలోని గ్రామాల్లో వేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు చెండే నవీన్, గోనెల శ్రీనివాస్, పెద్దనపల్లి దుబ్బగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.



చెత్త ట్రాక్టర్లు అడ్డుకుంటున్న గ్రామస్తులు

పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

లక్సెట్టిపేట: ప్రభుత్వం దివ్యాంగులకు అందించే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి రవూఫ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం ఏర్పాటు చేసిన దివ్యాంగుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే పరికరాల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరించారు. 440దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి నెల రోజుల తరువాత ఎంపిక చేస్తామని, అర్హులైన ప్రతీ ఒక్కరికి పరికరాలు అందించేలా చూస్తామని తెలిపారు. అనంతరం పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, సీడీపీవో రేష్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి రవూఫ్‌ఖాన్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


బెల్లంపల్లిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తాళ్లగురిజాల పోలీసులు పట్టుకున్నారు. పెర్కపల్లి గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా నెన్నెల మండలం గుండ్ల సోమారం గ్రామానికి చెందిన దుగుట కుమార్, తైదల విశ్వనాథ్‌ల ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. గుండ్ల సోమారం వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసి పెర్కపల్లిలో డంపింగ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాండూర్‌లో మట్టి ట్రాక్టర్లు పట్టివేత

తాండూర్: మండలంలోని రేచిని గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రేచిని శివారులో ఉన్న ప్రభుత్వ చెరువు వద్దకు వెళ్లి గురువారం అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలను తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ఆదేశాల మేరకు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీబీ, ఐదు ట్రాక్టర్లను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని తాండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్ఐ ఎండీ ఎజాజుద్దీన్ తెలిపారు.

గిరిజన గ్రామంలో డీఆర్డీవో పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గిరిజన గ్రామం ర్యాలీలో గురువారం డీఆర్డీవో కిషన్ విస్తృతంగా పర్యటించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో చేపడుతున్న పౌల్ట్రీ షెడ్, పశువుల పాక, నాడెపు కంపోస్ట్ షెడ్‌ల నిర్మాణాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు వెంటనే సంబంధిత పనులకు బిల్లులు వెంటనే రికార్డులు చేసి బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్డీవో వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాసరెడ్డి, టీఏ శంకర్, మేట్ మురళీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పశువుల పాక నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో

మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్‌కు సన్మానం

శ్రీరాంపూర్: సుదీర్ఘకాలం కంపెనీలో పనిచేసి ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందుతున్న కార్పొరేట్ మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్‌ను శ్రీరాంపూర్ ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో గురువారం ఏరియా జీఎం శ్రీనివాస్ ఆయన్ను శాలువాతో సత్కరించి కంపెనీలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, మల్లయ్య, ఏజెంట్లు శ్రీధర్, వెంకటేశ్వర్లు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. టీబీజీకేఎస్ నాయకులు మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. రిటైర్మెంట్ తర్వాత శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రమేష్, కేంద్ర కమిటీ నాయకులు పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, ఉత్తేజ్ రెడ్డి పాల్గొన్నారు.



జీఎం రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంటులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పదవీ విరమణ పొందుతున్న మార్కెటింగ్ జీఎం డి.రవిప్రసాద్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. సంస్థకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఐటీ డీజీఎం హరిప్రసాద్ ఉద్యోగులకు ఎఫ్ఎల్ఎం(ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్) అనే అంశంపై అవగాహన కల్పించారు. శిక్షణ బృందం పలు అంశాలను ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, జీఎం శ్రీనివాసులు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన జీఎంను కలిసిన నేతలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన జీఎం శ్రీనివాస్‌ను గురువారం బీఎంఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు జీఎం కార్యాలయంలో జీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా సెక్రెటరీ రాగం రాజేందర్, నాయకులు జిల్లా తిరుపతి, మహేందర్, కుమ్మరి చంద్రశేఖర్, బుర్ర అరుణ్‌గౌడ్, బుక్య కిశోర్‌లు పాల్గొన్నారు.

సిక్కా నేతలు..

శ్రీరాంపూర్ ఏరియా క్లర్కుల సంఘం(సిక్కా) నేతలు నూతన జీఎం శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జీఎం కార్యాయలంలో ఆ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కే సమ్మయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు కన్నం సాంబయ్య జీఎంను సత్కరించారు. ఆ సంఘం ఏరియా సెక్రెటరీ శ్రీధర్, కోశాధికారి రవి, నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

తాండూర్: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి అన్నారు. మాదారం టౌన్‌షిప్‌లోని సేవా సమితి కార్యాలయం ఆవరణంలో గురువారం బ్యూటీషియన్, కుట్టు మిషన్, ఎంబ్రాయిడరింగ్, యోగా, తదితర కోర్సులను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలు తీరిక సమయాల్లో వచ్చి ప్రతీ రోజు గంట సేపు కోర్సులు నేర్చుకోవాలన్నా రు. కుటుంబ పోషణలో భాగంగా స్వయం ఉపాధి కోర్సులను నేర్చుకొని, కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా అండగా నిలవాలని సూచించా రు. కార్యక్రమంలో మహిళలు, శిక్షకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

శాంతిగనిలో ‘బాయిబాట’

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిగనిపై గురువారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించి నాయకులు మాట్లాడారు. శాంతిగనిలో పనిచేస్తున్న కొందరు అధికారులు, ఓవర్ మెన్‌లు కార్మికులపై తీవ్రమైన పనిభారాన్ని మోపి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్మికుల వద్ద నుంచి లంచాలు తీసుకొని జల్సాలు చేస్తున్నారని మండిపడ్డారు. పద్ధతులు మార్చుకోకపోతే తగిన కార్యచరణతో ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. గని కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవీ భూమయ్య, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు సమ్మయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, జాయింట్ జనరల్ సెక్రటరీ సూర్య నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, ఏరియా కార్యదర్శులు కుక్కల ఓదెలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాంటీన్ నిర్మించాలి

శ్రీరాంపూర్: ప్రస్తుతం ఉన్న క్యాంటీన్ శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో కొత్తగా క్యాంటీన్ నిర్మించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు శంకర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఆర్పీ 3 గనిని గురువారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంఖ్యకనుగుణంగా మరో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులు తమ సామగ్రిని భద్రపరుచుకుంటున్న రూములో పైకప్పు రేకులు పగిలిపోయాయని, వర్షాకాలం వర్షపు నీరు చేరి వస్తువులు తడిసిపోతున్నాయన్నారు. కొత్త రేకులు అమర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, కలవేని శ్యాం, రీజియన్ సెక్రెటరీ పేరం రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు భద్రతపై సమీక్ష

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎల్లందు క్లబ్ ఆవరణలో గల మీటింగ్ హాల్లో భద్రతపై గురువారం వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లతో బెల్లంపల్లి రీజియన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీఎంఎస్ బిస్వనాథ్ బెహరా, డీడీఎంఎస్(మెకానికల్) ప్రేమ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు హాజరై పని ప్రదేశాల్లో భద్రతపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాలు తెలుసుకున్నారు. ఓసీల్లోని డంపర్లపై విధులు నిర్వర్తించే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ జీఎంలు, సేఫ్టీ ఆఫీసర్స్, వర్క్‌మెన్ ఇన్స్‌స్పెక్టర్స్, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఏరియాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎంఎస్ బిస్వనాథ్ బెహరా

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

తాండూర్: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు పునఃప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లెవాడ శివారులోని ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలకు లోబడి పత్తిని కొనుగోలు చేయనున్నట్లు, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

సమస్యలు తీర్చాలని వినతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐదో వార్డులో కుక్కలు,దోమల బెడద తీవ్రంగా ఉందని, ఆ వార్డు ప్రజలు గురువారం మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టపల్లి తిరుపతి, మల్లేశ్ కోరారు. మార్చి 2, 3, 4, 5తేదీల్లో యూఎస్ఎఫ్ఐ నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్‌కు సంబంధించి ప్రచార పోస్టర్‌ను గురువారం హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ ఆవిష్కరించారు.

శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం అన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. మ్యూజికల్ ఛైర్, బెలూన్ బ్లాస్ట్, రీ క్రియేషన్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జోబిన్ బహుమతులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

హద్దులు గుర్తించి ట్రెంచ్ ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్ర చెరువు శిఖం భూమి హద్దులు గుర్తించి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇరిగేషన్ ఆఫీస్‌లో గురువారం డీఈ శారదకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

చెన్నూర్: పట్టణ శివారులోని 863సర్వే నంబర్‌లో గతంలో జర్నలిస్టులకు ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలంలో గురువారం స్థానిక తహసీల్దార్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు జరపాలని కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన స్థలంలో ఎవరైనా కట్టడాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హాజీపూర్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండ, సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియం స్కూళ్ల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా ఐఎఫ్‌పీ పానల్ బోర్డుల వినియోగంపై అవగాహన కల్పించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జి.హన్మాండ్లు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఆర్‌పీలతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ ఏపీఎం శ్యామల, ప్రత్యేక శిక్షణ అధికారి దినేష్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన విద్యార్థుల ఆటపాట

మంచిర్యాలఅర్బన్: స్థానిక హరిత ఫంక్షన్‌హాల్లో మంచిర్యాల వొకేషనల్ కాలేజీ, శ్రీ సాయి పారామెడికల్ కళాశాల ఫేర్వెల్ గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు అలరించాయి.

గోవింద్ పన్సారేకు నివాళి

పాతమంచిర్యాల: గోవింద్ పన్సారే వర్ధంతిని జిల్లా కేంద్రంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. గోవింద్‌పన్సారే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి

రామకృష్ణాపూర్: స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన పార్టీ సీపీఐ అని మొదటి నుంచి పేదల పక్షపాతిగా నిలుస్తూ, వారి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు సాగించిందన్నారు. కార్మికవర్గం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర సీపీఐకి ఉందని పేర్కొన్నారు. దేశంలో మతాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతూ మతతత్వ రాజకీయాలను పెంచిపోషిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా సీపీఐ పోరాటాలు సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, చంద్రశేఖర్, మిట్టపెల్లి శ్రీనివాస్, పౌల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.